RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :187 EDITOR: CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 22 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 187 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 22 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## బంగారు తెలంగాణను ఇవాళ అప్పులపాలు చేశారు

### నిర్మలా సీతారామన్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

" బంగారు తెలంగాణను ఇవాళ అప్పులపాలు చేశారు " అని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురానగర్‌లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తరపున ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ

మిగతా 2లో

## రైతులను ఎందుకు విలన్లుగా చిత్రీకరిస్తున్నారు

సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

రైతులను ఎందుకు విలన్లుగా చిత్రీకరిస్తున్నారని సుప్రీంకోర్టు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాల దగ్ధం అంశం పరిశీలనలో ఉందని పేర్కొంటూ... పంజాబ్ రైతులకు మద్దతు ప్రకటించింది. శీతాకాలంలో పంట వ్యర్థాల దగ్ధంతో ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రమౌతోందంటూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు కొన్ని ప్రోత్సాహకాలు అందించాలని సూచించింది. రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాల గురించి హర్యానా ప్రభుత్వం నుండి నేర్చుకోవాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది.

# రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే..!



## టీపీసీసీ అధ్యక్షులు యనమల రేవంత్ రెడ్డి

మహబూబ్ నగర్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ ఆగడాలకు అంతులేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రత్యేక రాష్ట్రంలో సాహసోపేత కార్యక్రమాలు చేపట్టి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షులు యనమల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రాల్లో జరిగిన కాంగ్రెస్ విజయభేరి యాత్ర బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన అంతం తర్వాత మహబూబ్‌నగర్ నుంచి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. మీ బిడ్డగా పీసీసీ అధ్యక్షుల హోదాలో ఇక్కడికి వచ్చానని, ఈ ప్రాంతంలో నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎవరు గెలిచినా ఈ ప్రాంతం నుంచి వలసలు పోలేదని, రైతుల ఆత్మహత్యలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకునే అవకాశం తల్లి సోనియమ్మ ఇచ్చిందని, దాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కేసీఆర్‌ను సొంత నియోజకవర్గంలో తిరస్కరిస్తే పాలమూరులో ఆతిథ్యమిచ్చి ఢిల్లీకి పంపించామని, కానీ ఈ ప్రాంతానికి ఆయన ఒరగబెట్టింది ఏమీ లేదని తెలిపారు. పాలమూరు ప్రజలు ఇచ్చిన రాజకీయ బిక్షతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రాజెక్టులపై వివక్ష కనబరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగానే రైతుల మీద ప్రేమ ఉంటే రాష్ట్రంలో రైతుల మరణాలను ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఏమొస్తదని ప్రశ్నించిన కేసీఆర్‌కు మనం సమాధానం చెప్పాల్సిన అవసరముందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రాజెక్టులు, బ్యాంకుల జాతీయీకరణ, భూ పంపిణీ, భారీ ప్రాజెక్టుల నిర్మాణం వంటి పథకాలు తీసుకొచ్చిన

మిగతా 2లో

## పదిలక్షల ఉద్యోగాలు..

# కులగణన

### రాజస్థాన్‌లో ఏడు గ్యారంటీలతో కాంగ్రెస్ మ్యానిఫెస్టో



జైపూర్ - ప్రభాత సూర్యుడు

రాజస్థాన్‌లోని ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ తాయిలాలు ప్రకటించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తూ ఏడు హామీలతో పాటు ప్రాధాన్యతలను ప్రస్తావించింది. ఈ ప్రధాన ప్రాధాన్యతలలో కొన్నింటిని మనం పరిశీలిస్తే, 'రైతుల సంక్షేమం' మొదటి స్థానంలో ఉంచింది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ఆధారంగా కనీస మద్దతు (ఎంఎస్‌పీ) హామీని నెలకొల్పేందుకు నిర్దిష్ట చట్టాన్ని రూపొందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. రైతులందరికీ సహకార బ్యాంకుల నుంచి రూ.లక్ష వరకు వడ్డీలేని వ్యవసాయ రుణ సౌకర్యం కల్పిస్తామని నేతలు ప్రకటించారు.. వ్యవసాయ బడ్జెట్‌లో మా ప్రభుత్వం ప్రారంభించిన 12 మిషన్లను విస్తరించి రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్ (ఈఆర్‌సీపీ) క్రమబద్ధమైన

మిగతా 2లో

## తొమ్మిదిన్నరేండ్లలో

# 1.60 లక్షల ఉద్యోగాలు

### - భర్తీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం
### - వెబ్‌సైట్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తొమ్మిదిన్నరేండ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి 1.60 లక్షల కొలువులు ఇచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అధికారిక వివరాలతో కూడిన వెబ్‌సైట్‌ను ఆయన మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టిస్తున్న

మిగతా 2లో

## బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే

# తెలంగాణ సంక్షేమం

### ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

ఖమ్మం- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో డజన్ మంది ముఖ్యమంత్రి అభ్యర్థులున్నారని, భట్టి ముఖ్యమంత్రి అయితడా అని ప్రశ్నించారు. ఆ పార్టీకి మళ్లీ 20 సీట్లలోపే వస్తాయన్నారు. రాయేదో.. రత్నమేదో తెలుసుకొని ఓటేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే దళితబంధైనా.. రైతుబంధైనా.. అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడవేస్తారని, దానికి బదులు తెచ్చేది 'భూమాత'నా.. భూమేతనా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం మధిర, వైరా, సూర్యాపేట, డోర్నకల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా మధిర, వైరా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు లింగాల కమల్‌రాజ్, బాణోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడారు. ఎన్నికల పర్యటనలో భాగంగా మధిరకు 70వ మీటింగ్‌కు వచ్చానని,



వెళ్లాల్సినవి ఇంకా 30 ఉన్నాయని తెలిపారు. తాను ఎట్టెట్ట పోతనో అట్టట్ట కాంగ్రెస్ ఊడ్చుకుపోతుందన్నారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఇండ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులే టార్గెట్‌గా తెలంగాణలో ఐటి దాడులు కలకలం రేపుతున్నాయి. ఆ పార్టీ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కెఎల్ఆర్, బడంగ్ పేట మేయర్, కాంగ్రెస్ నేత పారిజాత నర్సింహా రెడ్డిల ఇళ్లపై ఇప్పటికే ఐటి దాడులు జరిగాయి. తాజాగా మాజీ ఎంపి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్ లోని

మిగతా 2లో

# కేటీఆర్‌ను సీఎం చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్

### గజ్వేల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల

గజ్వేల్- ప్రభాత సూర్యుడు

కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేయకుండా.. తననే సీఎం చేయాలని అడ్డం పడతానని పార్టీ నుంచి బయటకు పంపించారని బీజేపీ గజ్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌ను సీఎం చేయాలనే ఉద్దేశంతో ఏడాది క్రితమే తనను బయటకు పంపించిన ముఖ్యమంత్రిని ఓడించే వరకు తనకు మనశ్శాంతి ఉండదన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులను రోడ్డుపైకి తెచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి హరీశ్‌రావు అహంకారాన్ని అణిచివేయాలంటే గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయాలంటే.. కేసీఆర్ పతనాన్ని గజ్వేల్ నుంచే ప్రారంభించాలని తెలిపారు. నిరుపేదలందరికీ ఇండ్లు కట్టిస్తామన్నారు. భూములు, కోల్పోయిన

మిగతా 2లో



## తొమ్మిదిన్నరేండ్లలో
# 1.60 లక్షల ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)
నేపథ్యంలో గత పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. తాము ఇచ్చిన లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కన్నా రెట్టింపుకు పైగా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. జనాభాతో పోల్చి చూసినప్పుడు దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంసిద్ధం అవుతున్న యువకులతో సుదీర్ఘంగా కేటీఆర్ చర్చించిన విషయం తెలిసిందే. వారి విజ్ఞప్తి మేరకు ప్రజలకు ముఖ్యంగా యువకులకు అందుబాటులో ఉండేలా ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత కూడా పలు రాజకీయ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారం వల్ల యువతలో పలు అపోహలు నెలకొన్నాయని కేటీఆర్ దృష్టికి యువకులు తీసుకొచ్చారు. ఆ చర్చ సందర్భంగా వారికి ప్రభుత్వ అధికారిక లెక్కలతో కూడిన వివరాలను కేటీఆర్ వివరించారు. ఆ సమాచారం పట్ల యువకులు సంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాటన్నింటినీ రాష్ట్ర యువతకు అందుబాటులో ఉంచాలని కేటీఆర్‌ను కోరారు. అందుకే వెబ్‌సైట్‌లో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలతోపాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయడం, విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల శిక్షణ కోసం మరిన్ని స్టడీ సర్కిళ్ల ఏర్పాటు వంటి అంశాలపైన వివరాలు అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క విద్యార్థి, యువతీ యువకులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి నిజాలు తెలుసుకోవాలని కేటీఆర్ కోరారు. వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉంచినట్లు ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఇండ్లు,
# కార్యాలయాల్లో ఐటీ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)
సోమాజిగూడ, మంచిర్యాలలోని ఆయన నివాసాలతోపాటు బేగంపేటలోని వివేక్ కార్యాల యంలో నాలుగు బృందాలు మంగళవారం రాత్రి వరకు సోదాలు నిర్వహించాయి. కీలక డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పలు పత్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్ద మొత్తంలో లావాదేవీ లపై నిఘా పెట్టిన ఇసి అధికారులు వివేక్ కుటుం బానికి సంబం ధించిన విశాఖ ఇండస్ట్రీ స్‌కు హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకులో ఉన్న ఖాతాల నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ ఐడిబిఐ బ్యాంకు ఖాతాకు ఈ నెల 13న రూ.8 కోట్లు బదిలీ అయిన ట్లు గుర్తించారు. ఈ లావాదేవీలపై అనుమానంతో సిఇఒ వికాస్‌రాజ్ ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు ఈ నగదును ఫ్రీజ్ చేశారు. ఈ నగదుకు సంబంధించి వివరాల సేకరణకు వివేక్ ఇళ్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు జరిపినట్లు తెలిసింది. ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లోని వ్యాపారులు, రాజకీయవేత్తల ఇళ్లలో కూడా ఐటి అధికారులు దాడులు నిర్వహించారు.

## పదిలక్షల ఉద్యోగాలు..కులగణన

(మొదటిపేజీ తరువాయి)
అమలు కోసం ఒక వివరణాత్మక ప్రణాళిక సమర్పించనున్నది.

**యువతకు ఉపాధి రెండవ ప్రాధాన్యతగా..**

యువత , ఉపాధి అంశాలను పెట్టింది. ఐదేండ్లలో 1పది లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, అందులో నాలుగు లక్షల మందిని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించుకోనున్నారు. పంచాయతీ స్థాయిలో నియామకాల కోసం కొత్త పథకాన్ని తీసుకువస్తామని, ఇందులో ఈ ఉద్యోగులు క్రమంగా ప్రభుత్వ ఖాళీలతో విలీనం చేస్తామనీ, అట్టడుగు స్థాయి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని కాంగ్రెస్ తెలిపింది. నిరుద్యోగ యువత ఉపాధి సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి, 'టోల్ ఫ్రీ కాల్ సెంటర్' సదుపాయం అలాగే 'ఈ-ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్' ప్రారంభిస్తామన్నది.

**మహిళా శక్తి గురించి**

మూడో ప్రాధాన్యతలో 'మహిళా శక్తి' ప్రస్తావన ఉంది. మహిళల భద్రతను పెంచేందుకు బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నది మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణ వార్డులో సెక్యూరిటీ గార్డులను నియమిస్తామన్నది. దీంతో లైంగిక వేధింపుల కేసుల్లో సత్వర న్యాయం కోసం సగటు విచారణ సమయాన్ని తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

**రోడ్‌వేస్ బస్సుల్లో మహిళలకు ఉచిత కూపన్లు**

ప్రస్తుతం ఉన్న రాయితీకి అదనంగా ప్రభుత్వం నడుపుతున్న రోడ్‌వేస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రతి నెలా మహిళలకు ఉచిత కూపన్ లభిస్తుంది. ముఖ్యమంత్రి ఉచిత చిరంజీవి ఆరోగ్య బీమా పథకం కింద ఉన్న కుటుంబ పెద్దలకు ఇంటర్నెట్ కనెక్షన్‌తో కూడిన స్మార్ట్‌ఫోన్‌లను అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

**కులగణనకు ప్రాధాన్యత..**

కుల గణనకు నాల్గవ ప్రాధాన్యత. వాస్తవ జనాభా ప్రాతిపదికన ప్రయోజనాలను గుర్తించేందుకు కులాల వారీగా జనాభా గణన నిర్వహిస్తామని అధికార పార్టీ తెలిపింది.

**చిరంజీవి ఆరోగ్యబీమా**

మ్యానిఫెస్టోలో వైద్యం, ఆరోగ్యం ఐదవ ప్రాధాన్యత. ఏటా రూ.25 లక్షల ఉచిత చిరంజీవి ఆరోగ్య బీమా మొత్తాన్ని ఏటా రూ.50 లక్షలకు ముఖ్యమంత్రి పెంచుతారని పేర్కొన్నది. దీనితో పాటు, జిల్లా , బ్లాక్ స్థాయిలో ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉచిత ఓపీడీ,ఐపీడీ కింద సౌకర్యాలు పెంచుతారు. సంతానం లేని దంపతులకు అండగా ఉండాలనే లక్ష్యంతో 'చిరంజీవి ఆరోగ్య బీమా పథకం'లో ఐవీఎఫ్ ప్యాకేజీని చేర్చి ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తామని ప్రజా మ్యానిఫెస్టోలో ప్రస్తావించింది.

## చంద్రబాబు ముందస్తు బెయిల్ పై విచారణ వాయిదా

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్) కేసులో టిడిపి అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయంటూ సిఐడి కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సిఐడి సమయం కోరడంతో విచారణను ఈనెల 23కి హైకోర్టు వాయిదా వేసింది.

# రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే..!

(మొదటిపేజీ తరువాయి)
ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్‌కు సింగిల్ విండో డైరెక్టర్ మొదలుకొని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించి రాజకీయంగా ఎదిగడానికి కారణమైనది కాంగ్రెస్సేనని గుర్తుంచు కోవాలన్నారు. వైయస్సార్ కాలంలో తన్నీరు హరీశ్ రావు మంత్రిగా పనిచేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. అందుకే విశ్వాసఘాతకమైన కేసీఆర్ కుటుంబాన్ని పారదోలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 20లక్షల కొలువుల భర్తీతో పాటు ప్రతి మహిళకు రూ.2500 పారితోషకం, రూ.500కే సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డల పెండ్లిలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, రైతుబంధు రూ.15,000, ఉపాధి కార్మికులకు రూ.12,000, తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లు రవి, మంద జగన్నాథం, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభ్యర్థి కూచుకుల్ల రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే తెలంగాణ సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)
పాత మెజార్టీ కన్నా ఇంకా రెండు సీట్లు పెంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి భట్టి విక్రమార్కతో వచ్చేదేంది.. పోయేదేందని ప్రశ్నించారు. భట్టి గెలుస్తేగా ముఖ్యమంత్రయ్యేదన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్‌లో దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నదే తప్ప దళితబంధులాంటి ఒక్క ఆలోచన కూడా చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే మధిర నియోజకవర్గం మొత్తం ఒక్కటేసారి దళితబంధు పెడతామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మధిర ఎమ్మెల్యేగా ఉన్న బోడేపూడి వెంకటేశ్వరరావు.. ఎన్నెస్పీ నీరు అందడం లేదని, ఆయకట్టు ఎండిపోతుందని వరి కంకులు తెచ్చి శాసనసభలో చూపించేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ వస్తలేదని అసెంబ్లీకి కంకులు, కిరోసిన్ బుడ్లు పట్టుకు వచ్చే దుస్థితి ఉండేదని, కానీ ఈ పదేండ్లలో ఎక్కడా ఒక ఎకరం పొలం ఎండలేదని చెప్పారు. అసెంబ్లీ గేట్లు తాకనీయపోవడానికి ఆయనెవరని ప్రశ్నించారు. అందుకే నోట్ల కట్టల ఆసాములకు ఓట్లతో గుద్ది గుద్ది బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం రావడం ఖాయమని సూర్యాపేటలో జరిగిన సభలో సీఎం కేసీఆర్ తెలిపారు. నా కంటే దొడ్డుగా, ఎత్తుగా ఉన్నోళ్లు చాలా మంది ఉన్నారని, వారు కనీసం ఆలోచించి.. మంచినీళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇవాళ బ్రహ్మాండంగా పాలేరు నుంచి పాలలాంటి నీళ్లు వస్తున్నాయన్నారు. నాగార్జునసాగర్ కింద టేయిల్‌పాండ్ నుంచి మంచినీళ్లు వస్తున్నాయని చెప్పారు. నిన్న రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాము గెలిచిన తెల్లారి బిడ్డా.. మిమ్మల్ని రోడ్డు మీద పండవెట్టి తొక్కుతామని మాట్లాడుతున్నాడని, డబ్బు మదంతో వస్తున్న మాటలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎర్రజెండాలు ఎగిరిన గడ్డ అని, కమ్యూనిస్టు ఉద్యమాలు నడిపిన గడ్డ అని, భీంరెడ్డి నర్సింహారెడ్డి లాంటి మహనీయులు పని చేసిన గడ్డ మీద ఈ దుర్మార్గుల ఆగడాలు ఏందన్నారు. బీజేపీకి ఓటేస్తే మోరిల వేసినట్లేనని తెలిపారు. రూ.30 వేల కోట్లతో యాదాద్రి పవర్‌ప్లాంట్ నల్లగొండలో నిర్మాణం కావడం జగదీశ్‌రెడ్డి కృషి ఫలితమేన్నారు. కాళేశ్వరం జలాలతో సూర్యాపేటను కోనసీమ లాగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి, సూర్యాపేట అభ్యర్థి జగదీశ్‌రెడ్డి అన్నారు.

కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ ధరణి వద్దని, దాన్ని బంగాళాఖాతంలో వేయాలని అంటున్నారని, ఎద్దు, పొలం లేని వారికి వ్యవసాయం గురించి ఏం తెలుసని సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. డోర్నకల్ నియోజకవర్గ సభలో సీఎం మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధి ఫలాలు కావాలో.. కాంగ్రెస్ రాజ్యంలో అవినీతి కావాలో.. ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రభుత్వం మూడోసారి రాగానే మంత్రి పదవి ఇస్తామని రెడ్యాకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

# కేటీఆర్‌ను సీఎం చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)
వారికి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తుందన్నారు. తాను గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కసారి కూడా గజ్వేల్‌కు రాలేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ నిర్వాసితులకు వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ నియోజకవర్గ ప్రచార సారథి కప్పర రాంప్రసాదరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ టేకులపల్లి రామ్‌రెడ్డి, నాయకులు నందన్ గౌడ్, బండారు మహేష్, మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# టన్నెల్‌లో ఎండోస్కోప్ కెమేరా ద్వారా కార్మికుల గుర్తింపు




**డెహ్రాడూన్- ప్రభాత సూర్యుడు:** ఉత్తరాఖండ్ టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికులంతా క్షేమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. నవంబర్ 12న నిర్మాణంలో ఉన్న టన్నెల్ కూలిపోవ డంతో.. 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. పది రోజులుగా వారిని బయటకు తీసేందుకు సహాయక సిబ్బంది యత్నిస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి వీరు చిక్కుకున్న ప్రదేశంలోకి ఆరు అంగుళాల వ్యాసం ఉన్న గొట్టాన్ని పంపించారు. ఆ పైప్‌లో ఎండోస్కోపీ తరహా కెమెరాను ఉంచారు. క్యాప్‌లు, డ్రస్‌లతో ఉన్న కార్మికులు కెమెరాలో కనిపించారు. తాము బాగానే ఉన్నామని చెప్పేందుకు యత్నిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కెమెరా ముందుకు వచ్చి వాకీ టాకీ ద్వారా మాతో మాట్లాడండి అని ఓ అధికారి వారిని కోరడం వినిపిస్తున్నది. సోమవారం రాత్రి ఈ గొట్టం ద్వారా కిచిడీ, ఇతర ఆహార పదార్థాలను పంపించారు. కార్మికులకు త్వరలో మొబైల్స్, ఛార్జర్లను పైపు ద్వారా పంపిస్తామని రెస్క్యూ ఆపరేషన్స్ ఇన్‌ఛార్జ్ కల్నల్ దీపక్ పాటిల్ తెలిపారు. కొండరాళ్లు విరిగి పడటం, స్థలాకృతి, రాళ్ల స్వభావం కారణంగా గత కొన్ని రోజులుగా కార్మికులను రక్షించే ప్రయత్నాలు విఫలమవుతున్నాయని అన్నారు. చిక్కుకున్న కార్మికులను చేరుకునేందుకు ఐదంచెల కార్యచరణ ప్రణాళికను రూపొం దించామని, ఒక్కో ఆపరేషన్‌ను ఐదు ఏజన్సీలకు అప్పగించామని చెప్పారు. ప్రధాన సొరంగం కుడి, ఎడమ వైపు నుంచి రెండు సొరంగాలు తవ్వుతున్నామని, సొరంగంపై నుంచి కూడా డ్రిల్లింగ్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే కూలీలంతా క్షేమంగా బయటకు వస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పదేండ్లలో పదిలక్షల కోట్లు లూటీ

## బీఆర్ఎస్ సర్కారుపై మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపణ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో పది పథకాలు ప్రవేశ పెట్టి రూ. పదివేల కోట్లు దోచుకున్నారని కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపించారు. కర్నాటక ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలు అమలు కాలేదనడానికి బీఆర్ఎస్ నేతలేమైనా లబ్దిదారులా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే శరత్, జాతీయఅధికార ప్రతినిధి షామా, సీనియర్ నేత వీ. హనుమంతరావులతో ప్రియాంక్‌ఖర్గే విలేకర్లతో మాట్లాడారు. నాలుగు ఐదు రోజుల నుంచి హైదరాబాదులో తిరుగుతున్నామన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో అనేక సమస్యలున్నాయన్నారు. బీఆర్ఎస్ నేతలు కర్ణాటక ప్రభుత్వాన్ని, కాంగ్రెస్‌ను బదనాం చేస్తున్నారని విమర్శించారు. సొంత రాష్ట్రంలో చేయలేక కర్నాటకపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పేదలకు కర్నాటకలో హామీలు అమలు అవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూసి బీఆర్ఎస్ భయపడు తున్నదని చెప్పారు. 2013లో మ్యానిఫెస్టోలో 165 అంశాలుంటే, 158 హామీలను అమలు పరిచినట్టు తెలిపారు.బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చూడాలని సూచించారు. కర్నాటకలో ఐదు గ్యారంటీలను ఆరు నెలల్లోనే అమలు చేశామన్నారు. ఆ విషయం బీఆర్ఎస్ నేతలకు ఏం తెలుసన్నారు. వాళ్లు లబ్ధి దారులు కాదు కదా? అని ప్రశ్నించారు. ఐదు గ్యారంటీల కోసం ఎన్‌రోల్ చేసుకుంటే అర్హత బట్టి అందిస్తామన్నారు. గహలక్ష్మి పథకాన్ని 1.60 కోట్ల మంది అందించామన్నారు. అన్న భాగ్య పథకాన్ని 3.92 కోట్ల మందికి ఇవ్వడం జరిగిందన్నారు. మోడీ, కేసీఆర్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలా మెలుగుతున్నారని విమర్శించారు. కర్నాటకలో ప్రతిరోజు 60 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. వాళ్లంతా ప్రభుత్వం బాగుండాలని దేవాలయాల్లో పూజలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 3600 మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇక్కడ ఉద్యోగాలు లేక బెంగళూరుకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని మంత్రి కేటీఆర్‌కు గుర్తు చేశారు. కర్నాటక ప్రజలు స్కీములతో రూ. 80 వేల నుంచి లక్ష వరకు సేవింగ్స్ చేసుకుంటున్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్ ప్రజాధనం ఫామ్‌హౌస్‌లో నింపుతున్నదన్నారు. కర్నాటకలో అన్ని స్కీమ్‌లు అద్భుతంగా అమలు అవుతున్నాయని చెప్పారు. పథకాలు అమలు కావడం లేదనే అనుమానం బీఆర్ఎస్ నాయకులకు ఉంటే గాంధీభవన్ నుంచి బస్సు పెడతాను తిరిగి పరిశీలించవచ్చునన్నారు. బీఆర్ఎస్ అంటే భ్రష్టు రాష్ట్రీయ సమితి అని ఎద్దేవా చేశారు.

## సంపాదకీయం

# వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్ద పీట

కొన్ని రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు పరిశీలిస్తే రాజకీయానికి కొత్త నిర్వచనం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిద్ధాంత రాద్ధాంతాలకు తావు లేదు. ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి ఎన్నికల్లో పోటీ చేయడమే ముఖ్యం. ఏళ్ల తరబడి అంటిపెట్టుకుని ఉన్న పార్టీని క్షణాల్లో మార్చి వేస్తున్నారు. చొక్కాలు మార్చినట్టు పార్టీలు మారుస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పార్టీలు మారుతున్న వారిని ప్రజలు ఆదరించటం లేదా... ఆదరిస్తున్నారు. గెలుపు అవకాశం ఉన్న పార్టీలో చేరి దర్జాగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రాజకీయాల పట్ల ఏవగింపు కలుగుతుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ అనేక రిస్ట్రిక్షన్స్ పెట్టి, ఎన్నికల కోడ్ ఉపయోగించి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో 550 కోట్ల నగదు పట్టుబడిందనీ, లక్షల కొద్ది లీటర్ల మద్యం పట్టుబడిందనీ, బంగారంతో పాటు వస్తు సామగ్రి పట్టుబడినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇప్పుడు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థులు చేస్తున్న ఖర్చు 10 వేల కోట్లకు ఎగబాకడం తథ్యమని ఎన్నికల పరిశీలకులు అంచనా వేస్తున్నారు.. ఇందులో మూడు వంతులు నల్లధనం అని అంచనా, దేశం వెలుపల పోగుపడిన వేల కోట్ల మేర నల్లధనం నుండి హవాలా ద్వారా తెప్పించి ఎన్నికల్లో విచ్చలవిడిగా పోటీపడి డబ్బులు పంచుతున్నారు. ఎన్నికల కమిషన్‌కి తెలియకుండా ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారన్న దానికి ఇప్పటివరకు ఖచ్చితమైన ఆధారాలు లేవు. కేవలం అంచనాలు మాత్రమే. ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక అభ్యర్థి రూ 20 కోట్ల నుంచి 100 కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో గెలుపొందిన 119 వారిలో 40 మంది పార్టీలను వీడి వేరే పార్టీ లోనికి వెళ్లారు. 2023 జనరల్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో రాజకీయ వలసలు ఊపందుకున్నాయి. పూట పూటకు రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయి. ఏ పార్టీకి ఎక్కువ అవకాశం ఉన్నది, ఏది తిరిగి అధికారంలోకి వచ్చే పరిస్థితులను అంచనావేస్తూ దాని మీద ఆధారపడి అటు నుంచి ఇటు నుంచి అటు వలసలు పెరుగుతున్నాయి. సొంతగూటికి చేరికలు, కొత్తగూడు వెతుక్కోవటాలు రోజుకో చోటుగా ఉంటున్నాయి. అన్నిటికన్నా ప్రజలలో ఉన్న ఎన్నికల గాలి ఎటువైపు వీస్తుందో అటువైపు రాజకీయ వలసలు పెరుగుతున్నాయి.స్వాతంత్ర పోరాటాల కాలంలో రాజకీయ విలువలు నిబద్ధతను కట్టుబడి ఉన్న పరిస్థితుల నుండి 80 వ దశకం లో ఎమర్జెన్సీ కాలంలో 'ఆయారాం–గయారాం ' సంస్కృతి ఉధృతంగా సాగింది.ఈ నాలుగు దశాబ్దాల కాలంలో రాజకీయ వ్యవస్థ, నైతిక విలువలు పూర్తిగా దిగజారి పోతున్నాయి. ఇప్పుడు పొద్దున ఒక పార్టీలో ఉంటే మధ్యాహ్నానికి మరొక పార్టీలో చేరి సాయంత్రానికి తిరిగి గూటికి చేరిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. అది అధికారంలో ఉన్న పార్టీ సంఖ్యాబలం ఎప్పుడు ఏ తీరుగా మారుతుందో చెప్పలేని విచిత్ర పరిస్థితి వచ్చింది. దీనిని నిరోధించడానికి 1985లో రాజ్యాంగంలోని షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపుల నిరోధక చట్టం (యాంటీ డిఫెక్షన్ లా) తీసుకువచ్చారు. దీనితో పార్టీ గుర్తులతో గెలిచి ఇష్టానుసారంగా పార్టీ మారడం కొంత మేరకు తగ్గింది. కానీ ఎన్నికైన సభ్యులలో మూడింట ఒక వంతు పార్టీ మారితే వారికి ఈ చట్టం వర్తించదని వెలుసుబాటు కల్పించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి వ్యక్తికి భావ ప్రకటన స్వేచ్ఛ తో పాటు వ్యక్తి ఆధిపత్యాన్ని వ్యతిరేకించే హక్కు స్వేచ్ఛ ఉండాలి. ఎవరికైనా నచ్చిన పార్టీని ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలి. ఫిరాయింపులను అడ్డుకునే పేరిట ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించే పరిస్థితి రావడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో తిరోగమనంగానే చెప్పవచ్చు. అయితే ఇది పూర్తిగా ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛను హరించేది అని చెప్పడానికి అవకాశం లేదు. మరొక మరోవైపు ఈ ఫిరాయింపు నిరోధక చట్టం అనైతిక అవకాశవాదాన్ని అడ్డుకోగలిగింది. పార్టీ మారిన మారుతున్న వారంతా సిద్ధాంతాలకు అనుగుణంగా విధానపరంగానూ విభేదించి పార్టీ మారడం లేదు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థాలే ఎక్కువగా కిరాయింపులకు కారణం అవుతున్నాయి. అంతేకాకుండా రాజకీయ బేరాలు, అధికారం పంచుకోవడాలు జరగడం పరిపాటయింది. దీంతో రాజకీయ అస్థిరత సర్వత్రా వ్యాపించింది. ఈ ఫిరాయింపులతో మొత్తం రాజకీయ స్వరూపమే మారిపోయింది. రాజకీయ సమీకరణల నేపథ్యంలో సంకీర్ణయుగ రాజకీయాల సమయములో ఈ ఫిరాయింపులు ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను సవాళ్లు గా మారాయి. ఏ పార్టీ ఎన్నికల రేసులో ముందంజలో ఉంటుందన్నదని భావిస్తారో ఆ పార్టీలోకి వలసలు జోరుగా సాగడం పరిపాటయింది.భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన మెజార్టీ రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారం చేపడుతున్నారు. కాబట్టి ప్రజలలో రాజకీయ చైతన్యం కల్పించి నైతిక విలువలు కలిగిన వారిని, నీతి నిజాయితీపరులుగా ప్రజల కోసం ప్రజల మధ్య ఉండి ప్రజాసేవ చేసి నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారిని ఆదరించి.. ఓటును నోటుకు అమ్ముకోకుండా ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలి.

# పుట్టపర్తిలో నేడు రాష్ట్రపతి పర్యటన

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం శ్రీసత్యుసాయి జిల్లా పుట్టుపర్తికి రానున్నారు. దీనికి సంబంధించిన వివురాలను కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రపతి మధ్యాహ్నం 3.05 గంటలకు ఒడిశాలో బయలుదేరి 2.35 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన 2.45 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.05 గంటలకు సాయికుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 42వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. 3.35 గంటలకు స్నాతకోత్సవంలో భాగంగా 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తారు. అనంతరం ప్రసంగిస్తారు. 4.20 గంటలకు రోడ్డు మార్గాన సత్యసాయి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.



# దేశం గెలవాల్సింది స్టేడియంలో కాదు

# పచ్చని పొలాల్లో..!

వికెట్ పడిపోతేనే దేశం ఓడిపోతుందేమోనని భయపడే
దేశ భక్తులారా...
ఈవిషయాలపై ఎప్పుడైనా దృష్టి పెట్టారా...
ఒక్కసారి ఆలోచించండి...

దేశానికి అన్నం పెట్టే దేహాలెన్నో పడిపోతున్నాయ్
పట్టించుకుంటున్నావా...

ఇష్టమైన క్రికేటెవరో
వంద పరుగులు చెయ్యాలని దేవుణ్ణి మొక్కుకున్నట్లు,
నీకు తెలిసిన రైతు ఎవరైనా
వంద బస్తాలు పండించాలని
ఎప్పుడైనా మనసారా కోరుకున్నావా...

రెండు గంటలు బ్యాటు పట్టుకొని ఆడినతను గాడ్ అయితే
నీకు జీవితాంతం బువ్వ పెట్టే రైతన్న కే పేరు పెడుతావ్ ?...

దేశాన్ని గెలిపించడానికి
కొన్ని బంతులే ఉన్నాయని తెలిస్తేనే,
టెన్షన్ పడి గొంతు తడుపుకుంటావ్.
దేశాన్ని బతికించే
నదులు చెరువులు కొన్ని మాత్రమే నీళ్ళతో ఉన్నాయ్
అనే ఆందోళన నీకుందా? ...

నీకు సంతోషం ఇచ్చే ఆటగాళ్ళను
నీకు ఇష్టమైన రీతిలో ఎంకరేజ్ చేస్తుంటావ్
నిన్ను బతికించే రైతులనెవ్వరూ
ఎంకరేజ్ చెయ్యడం లేదని తెలుసా....

నీకు ఏ స్టేడియంలో పిచ్ ఎలా ఉంటదో తెలుసు కానీ
నీ ఊరిలో మార్కెట్ యార్డు అసలెక్కడుందో
ఎలాంటి పరిస్థితుల్లో ఉందో తెలుసా...

అన్నం తింటూ కూడా ...
పాకిస్తానీ టీంని దేశంలో రానియ్యాల వద్దా అని

నీకు తెలిసిన గొప్పలు ప్రదర్శిస్తావ్!
అసలు నీ చేతిలో ఉన్నది స్వదేశీ బియ్యమో
విదేశీ దిగుమతి బియ్యమో తెలుసా...

ఇండియన్ క్రికెట్ బోర్డో, క్రికెట్ టీమో
చేసే తప్పొప్పులన్నీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటావ్
వ్యవసాయానికి పెట్టింది పేరయిన దేశంలో
ప్రభుత్వాలు చేసే
తప్పొప్పుల్నిజి
అసలెప్పుడైనా పట్టించుకున్నావా...

ఎవరు ఎప్పుడు ఎంత స్కోర్ చేశారో తెలిసిన
నీకు
రోజూ ఎక్కడెక్కడ ఎంతమంది రైతులు చస్తున్నారో తెలుసా ....

ఎప్పుడైనా,
గిట్టు బాటు ధరలకోసమో, విద్యుత్తుకోసమో పోరాటం చేస్తూ
లాఠీ దెబ్బలు తింటూ పరిగెత్తే రైతన్నల బాధలను చూశావా...

ఏ దేశం బౌలరు ఎలా బాల్ వేస్తాడో తెలిసిన నీకు
రాజ్యం, దళారీలు ఎలా రైతులను మోసం చేస్తున్నారో ఏనాడైనా ఆలోచించావా?



సేకరణ : కస్తా శంకర్రావు, చీఫ్ ఎడిటర్
ప్రభాత సూర్యుడు


కామెంట్రీలు వింటూ టీవి లకు అతుక్కు పోయినట్లు
రైతుల గురించి చర్చా కార్యక్రమాలు ఏనాడైనా చూశావా...?

పది మంది ఆడే ఆటకోసం లక్షల మంది ఒక్కటౌతున్నాం
కోట్లమంది ఆకలి తీర్చే రైతుల కోసం ఏం చేస్తున్నాం....

ఇండియా గెలవాల్సింది స్టేడియాల్లో కాదు
పచ్చని పోలాల్లో ...
అందుకు
రైతులు నాటౌట్ గా నిలవాలి
మంచి ప్రత్యామ్నాయ విధానాలు అమలు జరిపే
నాయకులను ఎన్ను కోవాలి ...

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం





**కుత్బుల్లాపూర్- ప్రభాత సూర్యుడు**

పది సంవత్సరాల పరిపాలనలో అభివృద్ధి శూన్యమని మళ్లీ కెసిఆర్ వస్తే రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోతుందని కుత్బుల్లాపూర్ వేణుగోపాల స్వామి మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా దీవెన కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. మాజీ డిసిసి అధ్యక్షులు కే ఎం ప్రతాప్ మరియు ఏఐసీసీ మహిళా నాయకులు దీపారాజ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో రాష్ట్రం అభివృద్ధి చెందడం ఖాయమని వారు అన్నారు. అనంతరం చిత్ర ప్రదర్శన ద్వారా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు కే పి విశాల్ గౌడ్, టిపిసిసి నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి, పి జితేందర్ రెడ్డి , మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షులు ఆర్ లక్ష్మి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జి మల్లారెడ్డి, తానం శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస రావు, జహంగీర్ భాయ్, ప్రేమ్ కుమార్ ,ధనలక్ష్మి, ఎన్ ఎస్ యు ఐ నాయకులు , ఐ ఎన్ టి యు సి నాయకులు మరియు నియోజకవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హుస్నాబాద్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..

**హుస్నాబాద్- ప్రభాత సూర్యుడు**

"ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ఓట్ల కోసం వస్తోంది.. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటేస్తే రైతులు మళ్లీ ఉరేసుకునే రోజులు వస్తాయి.. మాటల మనిషి కావాలా.. చేతల మనిషి కావాలా.. హుస్నాబాద్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే" అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్‌కు మద్దతుగా మంత్రి హరీశ్‌రావు మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ జన ప్రభంజనాన్ని చూస్తుంటే సతీషన్నకు భారీ మెజారిటీ ఖాయమన్నారు. నీతి నిజాయితీ, నిబద్దతతో పనిచేసే వ్యక్తి సతీషన్న అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అవసరమైన నిధులు మంజూరు చేశారని తెలిపారు. రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించామన్నారు. దేవాదుల, మిడ్ మానేరు ద్వారా హుస్నాబాద్ గడ్డకు గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందన్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో అభివృద్ధి చేస్తే అక్కడే గెలవాలని, అక్కడ ఏమీ చేయకనే హుస్నాబాద్‌కు వచ్చి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజల మనిషి నీతి నిజాయితీ గల సతీష్‌ను గెలిపించాలన్నారు. కేసీఆర్‌కు లక్ష్మీ నియోజకవర్గంగా.. సెంటిమెంట్‌గా ఉన్న



హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరాలన్నారు. చుక్క నీరు లేక ఇబ్బంది పడ్డ హుస్నాబాద్ నేడు రెండు పంటల సాగుతో కలకలాడుతోందన్నారు. సాగు నీరుకు నోచుకుని హుస్నాబాద్‌కు మిడ్ మానేరు నీళ్లు తెచ్చుకున్నామని చెప్పారు.

### శివసేన తెలంగాణ

# ఎమ్మెల్యే అభ్యర్థి విత్ డ్రా



**కుత్బుల్లాపూర్ -ప్రభాత సూర్యుడు**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో శివసేన తెలంగాణ పార్టీ బలపరిచిన అభ్యర్థి లక్ష్మణ్ కాక నామినేషన్ వేసిన విషయం అందరికీ తెలిసిందే. ఇదిలా ఉండగా నామినేషన్ వేసిన నాలుగు రోజులకు లక్ష్మణ్ కాక మాతృమూర్తి భారతిబాయ్ పరమపదించారు. ఆయన కన్నతల్లి మరణించడంతో మనస్థాపానికి గురయ్యానని ఎమ్మెల్యే అభ్యర్థికి విత్ డ్రా చేసుకోవడం జరిగిందని కానీ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజలకు సేవ చేసే విషయంలో ముందంజలో ఉంటానని ఆయన తెలిపారు. ఆయన వెంట ఉన్న పార్టీ కార్యకర్తలకు రెండు మూడు రోజుల్లో అధిష్టానం ఆదేశాలను బట్టి ఏ పార్టీకి మద్దతు తెలిపే విషయం తెలియజేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హీరాలాల్ ,సిద్దు , కాళిదాస్, విశాల్, షిండే, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి గెలుపు కోసం అరుణాచలంలో ప్రత్యేక పూజలు



**చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు**

తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం శివాలయంలో మైనంపల్లి రోహిత్ రావ్ భారీ మెజార్టీతో గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ నియోజకవర్గంలో రోహిత్ రావు కాంగ్రెస్ పార్టీ తరఫున గెలవడం ఖాయమని కానీ భారీ మెజార్టీ కోసం అరుణాచలం శివాలయంలో మంగళవారం ఉదయం గిరి ప్రదక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించామని శంకరంపేట్ సర్పంచ్ రాజిరెడ్డి ప్రభాత సూర్యుడు ప్రతినిధికి చరవాణి ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీవన్ ముదిరాజ్, సంకాపూర్ తాండ సర్పంచ్ రాజాసింగ్ , కరుణాకర్ ,రాజు లు ఉన్నారు.

# 78 సీట్లతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం

## - విలేకరుల సమావేశంలో మల్లు భట్టి విక్రమార్క



**ముదిగొండ-ప్రభాత సూర్యుడు**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సునామి రాబోతుందని, 78 సీట్లతో రాష్ట్రంలో అధికారం చేపట్టబోతున్నామని సిఎల్పీ నేత, కాంగ్రెస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలో బాణాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యమంటే కేసీఆర్‌కి ఏం తెలుసు అని ప్రశ్నించారు. పని లేని వాళ్లకు పని కల్పించడం, నీళ్లు లేని వాళ్లకు నీళ్ల అందించిందన్నారు. భూస్వాముల నుండి భూములు తీసుకుని పేదలకు పంచటం, ఇల్లు లేని వాళ్లకు ఇల్లు మంజూరు చేయటం ఇంటి స్థలాలు ఇవ్వటం ఇందిరమ్మ రాజ్యంలో జరిగిందన్నారు. పెన్షన్‌లు ఇవ్వటం ఇందిరమ్మ రాజ్యమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక పవర్ ప్రాజెక్టులను డిజైన్‌తో, నిర్మాణం చేసి కరెంటు వెలుగులను ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తెలంగాణ రాష్ట్రం విభజన జరిగిన సమయంలో కూడా సోనియా గాంధీ నాలుగు శాతం పవర్ ఎగస్ట్రా కేటాయించిందన్నారు. రాష్ట్రానికి కాంగ్రెస్ కావాలన్నా కరెంటు కావాలని కేసీఆర్ మాట్లాడుతున్నాడని, రాష్ట్రానికి కరెంటు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి మొదలుపెట్టింది యాదాద్రి భద్రాద్రి, నిర్మించి ఉపయోగం లేకుండా చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి పాదయాత్ర ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ఆసమస్యలు పరిష్కారానికి ఆరు గ్యారెంటీలు పథకాలను ప్రవేశపెట్టామన్నారు. కేసీఆర్ లా ప్రగతి భవనం, ఫామ్ హౌస్‌లో పడుకోలేదని ఆయన ఎద్దవా చేశారు.

# ఎన్నికల బరిలో 'బర్రెలక్క'



**నాగర్‌కర్నూల్- ప్రభాత సూర్యుడు**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లిలో నిరుద్యోగ యువతి శిరీష. బర్రెలక్కగా సోషల్ మీడియా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీఈడి రెండో సంవత్సరం చదువుకుంటున్న శిరీష పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయడంలో నిర్లక్ష్యం కనబరుస్తోందంటూ.. "ఉపాధి కోసం ఉద్యోగాలు ఇవ్వకుండా బర్రెలు, గొర్రెలు కొనుక్కొని జీవనోపాధి పొందాలని పాలకులు చెబుతున్నారు. నాకు ఉద్యోగం రాకపోవడంతో మా అమ్మ గేదెలను కొనిచ్చింది. ఉదయం, సాయంకాలం కలిపి ఆరు లీటర్ల పాలు ఇస్తాయి.. దీనితో నేను జీవనం సాగిస్తాను..' అని నాలుగు గేదెలను చూపుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ వీడియో చూసిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బర్రెలక్క శిరీషపై పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టి వేధించడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో తెలంగాణలో శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్ పడింది. నిరుద్యోగుల ఆవేదనను ప్రజలకు తెలియజేయడానికి కొల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె బరిలో నిలిచారు బర్రెలక్క శిరీష. పెద్దకొత్తపల్లి మండలం మర్రికళ్ల గ్రామానికి చెందిన బర్రెలక్కకు తల్లి, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తండ్రి రెండేండ్ల కిందట ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వారు పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో రేకుల ఇంట్లో జీవిస్తున్నారు. చిన్నపాటి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకున్న రెండు గుంటల భూమిని సైతం తండ్రి ఇతరులకు అమ్ముకొని వెళ్లిపోయాడు. ఆ భూమి తమకే చెందాలని ఇతరులు కేసు పెట్టడంతో కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. తల్లి మీద భూమి కేసు, శిరీష మీద సోషల్ మీడియా కేసుతో నిత్యం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయన్న పాలకుల మాటలు నీటి మూటలు అయ్యాయి. అందుకే పాలకుల కనులు తెరిపించడానికి కొల్లాపూర్ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల్లో తాను సైతం పోటీ చేస్తున్నానని శిరీష చెబుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిరీషకు నియోజకవర్గమే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. నిరుద్యోగులకు న్యాయం జరిగే దాకా తాను అలుపెరుగని పోరాటం చేస్తానని ఆమె చెప్తున్నారు. తాను ఏ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, నిరుద్యోగుల జీవన ప్రమాణాలను మార్చడానికే తన వంతు కృషి చేస్తున్నానన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది నిరుద్యోగులకు ప్రత్యేక ప్రయోగాత్మకంగా కొల్లాపూర్ శాసనసభకు నిలబడుతున్నానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "వందల కోట్ల ఆస్తిపరులు పోటీ చేస్తుండగా.. నయా పైసా కూడా లేని నేను బరిలో నిలవడం కష్టమే. అయినా నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో వారి వాయిస్ వినిపించడానికి పోటీ తప్పదు" అని అన్నారు.

# జనవరి 12న విద్యార్థుల పార్లమెంట్ మార్చ్



**న్యూఢిల్లీ -ప్రభాత సూర్యుడు**

'రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాలి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి. విద్యారంగాన్ని పరిరక్షించాలి. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ని తిప్పికొట్టాలి" అంటూ దేశంలో ఎస్ఎఫ్ఐ సహా 16 విద్యార్థి సంఘాలు ఐక్యంగా జనవరి 12న పార్లమెంట్ మార్చ్‌కు పిలుపునిచ్చాయి. మంగళవారం ఈ మేరకు స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 16 విద్యార్థి సంఘాల నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ క్యాంపస్‌లు పోరాట కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. కాషాయీకరణే ధ్యేయంగా అమలుచేస్తున్న నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) వెనక్కి తీసుకోవాలని, నీట్ పరీక్షలను ఉపసంహరించుకోవాలని, విద్య, ఉపాధి హామీ కోసం భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలనీ, 'రోహిత్ వేముల' చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను అంతం చేయడానికి, అన్ని క్యాంపస్‌లలో బాలికలపై హింసను నిరోధించడానికి జిఎస్ క్యాస్ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల మంది విద్యార్థులు పార్లమెంటుకు పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. ఫిబ్రవరి 1న చెన్నైలో ఐక్య ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతిపక్ష నేతలను కలిసి విద్యార్థి ఫ్రంట్ డిమాండ్లను 'ఇండియా' కూటమి ఎన్నికల ఎజెండాలో చేర్చాలని కోరనున్నట్టు తెలిపారు. విద్యార్థుల మార్చ్‌ను అడ్డుకునేందుకు సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారనీ, ఏది ఏమైనా తాము కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2025లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది పూర్తి చేసుకోనుందనీ, సంఘ్ పరివార్ దాడులకు గురవుతున్న దేశ ప్రజాస్వామ్య లౌకిక విలువలు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు విద్యార్థులు సంఘటిత శక్తిగా మారాలని ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో డీఎంకె స్టూడెంట్ వింగ్ కార్యదర్శి, కాంచీపురం ఎమ్మెల్యే సీవీఎంపీ ఎజిఅరసన్, ఏఐఎస్ఏ అధ్యక్షుడు నీలాశిష్ బోస్, ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి నితీశ్ గౌర్, ఏఐఎస్‌బీ కన్వీనర్ సౌమ్యదీప్ సర్కార్, సీఆర్జేడీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక భారతి, సీవైఎస్ఎస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ ఫిరాయింపుదారులే

## సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం



**నేలకొండపల్లి-ప్రభాత సూర్యుడు**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను రోజూ పేపర్లలో చూస్తున్నాం.. టీవీల్లో వింటున్నాం.. కానీ ఏడో గ్యారంటీగా పొరపాటున నువ్వు ఎన్నికల్లో గెలిస్తే పార్టీ ఫిరాయించననే మాట ఇస్తావా అని పాలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గ్రామాల్లో ప్రజలు ప్రశ్నించాలని సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్ రెడ్డి కూడా ఫిరాయింపుదారుడేనని దుయ్యబట్టారు. మండలంలోని భైరవునిపల్లి, అజరు తండా, తిరుమలాపురంతండా, కొత్త కొత్తూరు, నేలకొండపల్లి పట్టణంలో తమ్మినేని వీరభద్రం మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రజలు, రైతులు, కూలీలు, కార్మికులు, ప్రత్యేకించి మహిళలు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. పాలేరులో కోట్లు కుమ్మరించి, ఓట్లు దండుకొని పదవి దక్కించుకోవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ కాంట్రాక్టర్లు ఆశపడుతున్నారన్నారు. పొరపాటున ఆ రెండు పార్టీల నుంచి ఎవరు గెలిచినా రాష్ట్రంలో అధికార పీఠం ఎక్కే పార్టీ వైపే ఈ నాయకులు తమ స్వార్థం కోసం, కాంట్రాక్టుల కోసం, డబ్బు సంపాదన కోసం పార్టీ ఫిరాయించడం ఖాయమని, ఈ విషయాలను ప్రజలు, ఓటర్లు గమనించాలన్నారు. కష్టజీవుల సమస్యల పరిష్కారమే ఏజెండాగా తీసుకొని రాష్ట్రంలో 19 స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల ద్వారా చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందడం ద్వారా అధికారం చేపట్టే పార్టీ మెడలు వంచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టంచేశారు. పాలేరులో పోటీ చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కందాల ఉపేందర్ రెడ్డి ఏనాడైనా రోడ్లెక్కి ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళన చేశారా.. అసెంబ్లీలో, మరెక్కడైనా ప్రజా సమస్యలపై చర్చించిన దాఖలాలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. కందాల కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరారని, గతంలో సీపీఐ(ఎం) మద్దతుతో వైఎస్సార్ పార్టీ తరపున ఎంపీగా గెలిచిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన అవకాశవాదం కోసం బీఆర్ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. తద్వారా రూ.28 వేల కోట్ల విలువగల కాంట్రాక్టులు దక్కించుకున్నారన్నారు. తిరిగి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపీతో మంతనాలు చేసి బేరం కుదరకపోయేసరికి కాంగ్రెస్‌లో చేరి ఊరూరా తిరుగుతూ పాలేరును ఉద్ధరిస్తానంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అమ్ముడుపోయే నాయకులను దృష్టిలో పెట్టుకొని రంగులు మార్చే రాజకీయ నాయకులను నమ్మి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215